
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం అక్టోబరు 9, 2024

నోట్ల తోరణం.. అమ్మ వైభవం

రూ.3.33 కోట్లతో వాసవీమాతకు అలంకరణ



మిలమిల మెరిసే కొత్త కరెన్సీ కట్టలు. తళతళలాడే నాణేలు. ఎటు చూసినా లక్ష్మీ కళ. దసరా మహోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని వాసవీ మాతను మంగళవారం రూ. 3.33 కోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం, ఆలయ ప్రాంగణాన్ని నోట్లు, నాణేలతో నింపేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అయోధ్య కోదండ రామునికి సమర్పించే రామబాణం కూడా భక్తుల దర్శనం కోసం అక్కడ ఉంచారు.

-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

దుర్గమ్మకు అన్నవరం దేవస్థానం పట్టు వస్త్రాలు

దసరా మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గ అమ్మవారికి అన్నవరం దేవస్థానం నుంచి మంగళవారం పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ, పండ్లు అందజేశారు. ఛైర్మన్ ఐ.వి. రోహిత్, ఈవో కె.రామచంద్రమోహన్‌లు కుటుంబసమేతంగా విజయవాడ వెళ్లి వీటిని సమర్పించారు.

-న్యూస్‌టుడే, అన్నవరం



పట్టువస్త్రాలతో వస్తున్న అన్నవరం దేవస్థానం ఛైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్ తదితరులు

రివ్వున ఎగురుతూ స్వస్థలాలకు!

దసరా సమీపించింది. పిల్లలకు వారం, పది రోజులు సెలవులు ఇవ్వడంతో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి స్వస్థలాలకు గోదారోళ్లు వచ్చేస్తున్నారు. బస్సు, రైలుతో పాటు ఆకాశయానం ద్వారా వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది.

ఉమ్మడి ఉభయ గోదావరివాసుల రాకపోకల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు మొత్తం 20 విమాన సర్వీసులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్నవన్నీ ఏటీఆర్ సర్వీసులు కావడంతో ఒక్కోదాంట్లో 72 మంది ప్రయాణించే సామర్థ్యం ఉంది. రోజూ 1,100 మందితో 70 శాతం ఆక్యుపెన్సీ నమోదవుతుంది. దసరా నేపథ్యంలో ఇది కాస్తా 1,400 వరకు ఉంటోంది. పూర్తిస్థాయిలో నిండుకుంటున్నాయి.

■ హైదరాబాద్‌కు డిమాండ్

గోదావరి జిల్లాలకు చెందిన వ్యాపార, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హైదరాబాద్ కేంద్రంగా వచ్చి వెళుతుంటారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ ఒక్క నగరానికే ఇండిగో విమానయాన సంస్థ ఏకంగా 14 సర్వీసులను నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మూడు నగరాలకు కలిపి 1.80 లక్షల మంది ప్రయాణిస్తే అందులో సుమారు 1.27 లక్షల మంది హైదరాబాద్‌కు ప్రయాణించారు.



న్యూస్‌టుడే, కోరుకొండ

■ రెట్టింపైన టికెట్ ధరలు

నెల రోజుల ముందు నుంచే విమాన టికెట్ల బుకింగ్ వేగం పుంజుకుంది. ఇప్పటికే 80 శాతానికి పైగా విక్రయాలు జరిగాయని సమాచారం. ప్రయాణికుల రాకపోకలు పెరిగే అవకాశం ఉండటంతో టికెట్ల విక్రయం పెరిగితే సాధారణంగా రూ.5 వేలు ఉండే ధర అమాంతం రూ.10 వేలు దాటుతోంది.

తగినన్ని లేక..

దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లినవారు రాకపోకలు సాగించేందుకు. అలానే పర్వదినాల్లో వచ్చేవారు కోరుకున్న సర్వీసులు తగినన్ని అందుబాటులో లేవు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు దిల్లీకి డిమాండ్ ఉంది. దుబాయ్, లండన్ ఇతర దేశాలకు కనెక్టివిటీ మీద గోదావరి, కోనసీమ జిల్లాలకు చెందిన కొందరు వచ్చి వెళుతున్నారు. దిల్లీ, ముంబయి వంటి ప్రధాన నగరాలకు నేరుగా విమానాలు లేక ప్రాంతాల వారీగా పలు సర్వీసులు మారడంతో టిక్కెట్ల ధర భారమవుతోంది. రాజమహేంద్రవరం విమానాశ్రయ డైరెక్టరు ఎస్.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ రోజుల కన్నా దసరా రోజుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందన్నారు. టికెట్ల డిమాండ్ రోజులను బట్టి మారుతుందన్నారు.

మరో రెండు ప్రత్యేక రైళ్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దసరా నేపథ్యంలో ఈ నెల 18 వరకు మరో రెండు ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు(07215) ప్రత్యేక రైలు ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో నడుస్తుంది. ఇది రాత్రి 8 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కు శ్రీకాకుళం చేరుకుంటుంది. శ్రీకాకుళం రోడ్డు-విజయవాడ(07216) రైలు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో నడుస్తుంది. ఇది శ్రీకాకుళంలో ఉదయం 6.30కు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ వస్తుంది. ఈ రైళ్లు ఉమ్మడి జిల్లాలో నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వే స్టేషన్లలో ఆగుతాయన్నారు.

కాటన్ వంతెన.. చీకటేనా

భక్తులు, వాహనదారుల అవస్థలు

గోదావరి కాటన్ వంతెనపై అంధకారం నెలకొంది. ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లకు సంబంధించి బ్యారేజీ రోడ్డు పొడవునా ఇటీవల వేసిన దీపాలు 50 శాతం పాడైపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ రోడ్డు మీదుగా రాత్రి సమయంలో కాలినడకన విజయవాడ కనకదుర్గ గుడికి వెళ్లే భవానీ మాలధారులు, కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు అనేకమంది వెళ్తుంటారు. స్థానికులూ అధికశాతం ప్రయాణాలు సాగిస్తుంటారు. సమస్యను గోదావరి ప్రధాన పనుల విభాగం సహాయ ఇంజినీర్ సాయిరాం వద్ద ప్రస్తావించగా వదులుగా ఉన్న కనెక్షన్లకు తోడు కొన్నిచోట్ల కోతులు స్తంభాలు ఎక్కి దీపాలను పాడుచేస్తున్నాయన్నారు. లోపాలను సరిచేసి ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం




చీకట్లో కాటన్ వంతెన రోడ్డు

నిధులు పారితే.. ప్రగతి అఖండమే

■ రూ.100 కోట్లతో గోదావరి ప్రగతి నివేదిక

■ 15న కేంద్రానికి అందించనున్న పర్యాటకశాఖ



ఈనాడు, కాకినాడ

గోదావరి పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రగతి ఫలాలు అందుబాటులోకి తేవాలన్నది పర్యాటక శాఖ ప్రణాళిక. ఈ మేరకు రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర పథక నివేదిక (డీపీఆర్)ను ఈనెల 15న కేంద్రానికి సమర్పించనుంది. ఈ నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు ఫెసిలిటేటర్స్ -కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఏపీపీఎఫ్‌సీఎస్) ప్రతినిధులు సిద్ధంచేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక ప్రగతి పనులకు సంబంధించి గతనెల 21న సాంకేతిక నిపుణుల బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, ఆకృతులపై ఓ స్పష్టతకు వచ్చింది. సమాచారం, మ్యాపులు సేకరించారు. గుర్తించిన పనుల్లో సాధ్యాసాధ్యాలపై కసరత్తుచేసి ఒక అంచనాకు వచ్చారు.

● రాష్ట్రంలో అఖండ గోదావరి, సంగమేశ్వరం, శ్రీశైలం, సూర్యలంక ప్రాజెక్టులకు సమగ్ర పథక నివేదికలు సిద్ధమయ్యాయి. పర్యాటక శాఖ ప్రతిపాదనలు పంపిన అనంతరం నిధుల మంజూరుపై కేంద్రం నిర్ణయం తీసుకోనుంది.

● రాష్ట్రంలో రెండు ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.200 కోట్ల మంజూరుకు అవకాశం ఉంది. 2027లో గోదావరి పుష్కరాలూ ఉన్నందున అఖండ గోదావరికి రూ.100 కోట్లు వస్తాయన్న ధీమా పర్యాటక శాఖ వ్యక్తం చేస్తోంది.

రూ.వెయ్యి కోట్లతో ప్రణాళిక

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.వెయ్యి కోట్లతో గోదావరి తీరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళిక ఉంది. అఖండ గోదావరిలో భాగంగా తీరం అభివృద్ధి, విహారానికి బోట్లు ఇతరత్రా చర్యలు పర్యాటక శాఖ పర్యవేక్షణలో చేపట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి పడవల్లో బ్రిడ్జిలంక వెళ్లి అడ్వెంచర్ గేమ్స్‌ను ఆస్వాదించి.. అక్కడ్నుంచి హేవలాక్ వంతెన వద్దకు వెళ్లి.. అక్కడి 18 స్పాన్లు మీదుగా రాజమహేంద్రవరం వచ్చేలా అభివృద్ధిచేయాలన్న ప్రతిపాదన ఉంది. ఇక్కడ బంగీజంప్‌తోపాటు పర్యాటకులకు ఆటవిడుపు, దుకాణాలు, ఇతరత్రా ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో ఏ ప్రణాళికలకు ఆమోదం దక్కుతుందన్నది కొద్దిరోజుల్లో స్పష్టత రానుంది.

రూ.52 కోట్లు.. 953 పనులు

నరేగా నిధులతో గ్రామాల్లో వసతులు

అమలాపురం కలెక్టరేట్: జాతీయ ఉపాధి హామీ పథకం(నరేగా) నిధులు రూ.52 కోట్లతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 953 పనులు చేపట్టనున్నారు. మంగళవారం ఉపాధి హామీ పథకంపై కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్షించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు 'పల్లె పండుగ' పేరిట వారోత్సవాలు నిర్వహించాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని భూమి పూజలు నిర్వహించాలన్నారు. పనులు వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాల్సి ఉందన్నారు. సిమెంటు, ఇసుక సరఫరాలో ఉన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డ్వామా పీడీ మధుసూదన్, డీపీవో శాంతి లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సలహాలేనా.. సమస్యలూ తీర్చాలి


'పొలం పిలుస్తోంది'లో రైతుల మొర



వరిచేలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే : వైకాపా అయిదేళ్ల పాలనతో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించింది. పథకాలను ఏకరవు పెట్టినా.. పైసా ప్రయోజనం కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. సాగులో కీలకమైన పరికరాలకు రాయితీ ఎత్తేసి మోసం చేశారు. భూసార పరీక్షల మాటే మరిచిపోయారు. సూక్ష్మపోషకాల పంపిణీ ఊసే లేదు. అన్నదాతలు భారీ ఎత్తున రసాయన ఎరువులు వినియోగించి ఆర్థికంగా నష్టపోయారు. దిగుబడులు పెరగకపోగా.. చీడపీడలు పెరిగి తగ్గిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాగులో సాంకేతిక సలహాలు అందించేందుకు గతనెల 24న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో సూచనలు, సలహాలతో పాటు రైతుల అవసరాలను గుర్తించాలని పలువురు కోరుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సభలు నిర్వహించి సాగులో సాంకేతిక విధానాలను వివరిస్తున్నారు.

సిబ్బంది కొరత..: వ్యవసాయ మత్స్యకార, ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్.. 14 శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాల్సి ఉంది. జిల్లాలో 402 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు 236 మందే ఉన్నారు. చాలా ఆర్‌ఎస్‌కేలు ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో నడుస్తున్నారు. మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉద్యాన, పశు సంవర్ధక, మార్కెటింగ్, మత్స్య శాఖలకు చెందిన అధికారులు పూర్తి స్థాయిలో లేక సిబ్బందిని పంపిస్తున్నారు.



రైతుల అవసరాలు ఇవీ..:

● వర్షాల నుంచి కాపాడుకోవడానికి బరకాలు (టార్పాలిన్లు) లేక పంటలకు నష్టం వాటిల్లుతోంది. ● పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు అవసరం. ● మట్టి పరీక్షలను నిర్వహించి.. వాటి ఆధారంగా పూర్తి రాయితీతో జింకు, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మధాతు పోషకాలను అందించాలి. ● పంత రోడ్లు నిర్మించాలి. ● తెగుళ్ల వ్యాప్తితో ఆక్వా రైతులకు నష్టాలు వస్తున్నాయి. మొబైల్ ఆక్వా ల్యాబ్ వంటి సౌకర్యం కల్పించాలి.

ప్రభుత్వానికి నివేదిస్తాం

కొన్నిచోట్ల మండల స్థాయి అధికారులు లేకపోయినా.. ఆ శాఖకు సిబ్బంది హాజరవుతున్నారు. సాగులో సాంకేతిక పరిజ్ఞానం, మెలకువలను రైతులకు వివరించడంతో పాటు వారి అవసరాలను తెలుసుకుంటున్నాం. వీటిని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం.

-వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

ఆశల వారధి.. దాటే దారేది..?

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన తీరప్రాంత వాసుల చిరకాల కోర్కైన సఖినేటిపల్లి-నరసాపురం వశిష్ఠ గోదావరిపై వారధి నిర్మాణం అందని ద్రాక్షలా తయారైంది. 70 ఏళ్ల నుంచి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పనులపై ఏవిధమైన కదలిక లేదు. ఎన్నికలకు ముందు ప్రజాప్రతినిధులు వాగ్దానాలు చేస్తున్నారే తప్ప వారధి నిర్మాణం చేపట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఆ కల తీరుతుందని ఆశిస్తున్నారు. **- న్యూస్‌టుడే, సఖినేటిపల్లి**



సఖినేటిపల్లి-నరసాపురం వంతెన నిర్మాణంపై ఆశలు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని తీరప్రాంత వాసులు ప్రయాణం చేయాలంటే సఖినేటిపల్లి-నరసాపురం వశిష్ఠ రేవు దాటాల్సిందే. నిత్యం పంటుపై వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. దీంతో ఇక్కడ వారధి నిర్మించాలని 1960లో నీలం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రి అల్లూరి సత్యనారాయణరాజు ప్రతిపాదనలు చేశారు. ఆయన మృతితో ఆ అంశం అక్కడితోనే ఆగిపోయింది.

నలుగురు ముఖ్యమంత్రుల హయాంలో..

● 1985లో మంత్రి చేగొండి హరిరామ జోగయ్య , 2003లో మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఫ్లోటింగ్ బ్రిడ్జికి భూమిపూజ చేశారు. ● 2008లో సఖినేటిపల్లి వద్ద భూమిపూజ చేశారు. ● 2018లో ఎమ్మెల్యే మాధవనాయుడు పలువురు ఎంపీలతో కలిసి దిల్లీ వెళ్లి వంతెనతో పాటు ఇరువైపులా జాతీయ రహదారి నిర్మాణానికి డీపీఆర్ మంజూరు చేయించారు. ● 2019లో వైకాపా ప్రభుత్వంలో సఖినేటిపల్లి-నరసాపురం వద్ద సాంకేతిక ఇబ్బందులు వస్తాయని దీని బదులు రామేశ్వరం(సఖినేటిపల్లి మండలం) - రాజుపాలెం (నరసాపురం మండలం) వద్దకు మార్చారు.

ఓ రైతు నిరాకరణతో..

వంతెనకు ఇరువైపులా 23 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణకు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు చేసింది. ఒక్కరైతు మాత్రం భూమి ఇవ్వడానికి నిరాకరిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీంతో అడుగులు ముందుకు పడలేదు.

అందుబాటులోకి వస్తే ఇవీ ప్రయోజనాలు

ఈ వంతెన నిర్మిస్తే తీరం వెంబడి కోస్టల్ కారిడార్ ఏర్పడుతుంది. ప్రయాణికులకు దూర, వ్యయభారం తగ్గుతుంది. అంతర్వేది అటు ఆధ్యాత్మిక పర్యాటక రంగం, ఫిషింగ్ హార్బర్లు అభివృద్ధి చెందుతాయి.

నిర్మాణానికి కృషి చేస్తా..

భూ సేకరణకు నిరాకరించిన రైతును కలిసి జాతీయ రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరాం. ఆయన్ను ఒప్పిస్తాం. అనంతరం వారధి నిర్మించడానికి కృషి చేస్తాం.

- దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

భూసేకరణ సమస్య పరిష్కారానికి వినతి

మలికిపురం: నర్సాపురం-దిండి మధ్య చేపట్టిన 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ సమస్యను త్వరితగతిన పరిష్కరించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కేంద్రమంత్రి బీహెచ్ శ్రీనివాసవర్మకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ లేఖ రాశారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ అయిన సఖినేటిపల్లి-నరసాపురం వారధి నిర్మాణం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రామేశ్వరం(డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా)-రాజుపాలెం(పశ్చిమగోదావరి జిల్లా) వద్ద వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణం, దీన్ని అనుసంధానిస్తూ నరసాపుం-దిండి(మలికిపురం మండలం) మధ్య 22 కిలోమీటర్ల 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు(రింగ్‌రోడ్డు) అభివృద్ధికి నిధుల మంజూరు చేసినట్లు లేఖలో పేర్కొన్నారు.

గోదారి బయటపడింది..

గోదావరి వరదల కారణంగా ఈ ఏడాది జులై నుంచి వారంరోజుల క్రితం వరకు బూరుగులంక రేవులో ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవించారు. ప్రస్తుతం నీరు తగ్గిపోవడంతో నదీపాయ బయటపడింది. దీంతో ఆవల ఉన్న ఊడిమూడిలంక, బూరుగులంక, జి. పెదపూడి లంక, అరిగెలవారి పేట లంక గ్రామాల ప్రజలు నడిచి రాకపోకలు సాగిస్తున్నారు. ఒకచోట మాత్రం కొద్దిగా లోతు ఉండటంతో అక్కడ నాటుపడవ వినియోగిస్తున్నారు. మరో పదిరోజుల్లో నీరు పూర్తిస్థాయిలో తొలగిపోయి రాకపోకలకు అవాంతరాలు తొలగిపోతాయని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**



విడివిడిగా కాదు.. కలివిడిగా..

మద్యం దుకాణాల కోసం రంగంలోకి పాత సిండికేట్లు ● నేటితో గడువు పూర్తి



అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్త మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచుతోంది. పది మందికి కలసి ఒక్కటి దక్కినా చాలు పదివేలని ఆశావహులు భావిస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు తిరిగిరాని డిపాజిట్ రూ.2 లక్షలు కావడంతో ఒకరు ఒకటి కన్నా ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేసేందుకు వెనుకాడుతున్నారు. మరోవైపు పాత సిండికేట్ సభ్యులు రంగంలోకి దిగారు. కొత్తగా దుకాణాలు ఆశిస్తున్న వారు వారికి తోడయ్యారు. 10 మంది కలిసి ఒక దుకాణానికి 10 దరఖాస్తులు విడివిడిగా దాఖలు చేస్తున్నారు. వీరిలో ఎవరికి లాటరీ తగిలినా మిగిలిన వారంతా భాగస్వామ్యులుగా ఉండే విధంగా ఒప్పందాలు చేసుకుంటున్నారు.

గ్రామీణ దుకాణాలకు గిరాకీ..

పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలకు వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గ్రామాల్లో చిల్లర వ్యాపారం ఎక్కువగా సాగుతుందనే వ్యాపారులు నమ్ముతున్నారు. వాటిని చేజిక్కించుకునేందుకు పోటీ ఎక్కువగా ఉంది.

1:13 నిష్పత్తిలో దరఖాస్తులు..

జిల్లాలో 133 మద్యం దుకాణాలకు మంగళవారం నాటికి ఒక్కో దుకాణానికి 13 చొప్పున 1,715 దరఖాస్తులు వచ్చాయి. బుధవారంతో గడువు ముగిసే నాటికి ఈ సంఖ్య 2,500కు చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రైవేటు బస్సుల తనిఖీ

ఈనాడు కథనానికి స్పందన

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దసరా నేపథ్యంలో ప్రైవేటు బస్సుల్లో అధిక ఛార్జీల వసూలుపై మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా రవాణాశాఖాధికారి డి. శ్రీనివాసరావు సిబ్బందితో తనిఖీలు చేయించారు. చించినాడ, మురముళ్ల, రావులపాలెంల వద్ద బస్సులను తనిఖీ చేసి ప్రయాణికుల నుంచి ఎంత ఛార్జీలు వసూలు చేశారనే విషయాన్ని తెలుసుకున్నారు.



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారి

కొంత మేర లాభాలు తగ్గించుకోండి

ధరల నియంత్రణకు సహకరించాలని జేసీ సూచన

అమలాపురం కలెక్టరేట్: నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు హోల్‌సేల్ వ్యాపారులు సహకరించాలని జేసీ నిశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో నిత్యవసరాల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. పౌరసరఫరాల అధికారులు ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. హోల్‌సేల్ వ్యాపారులు సమావేశం ఏర్పాటు చేసుకుని వారి లాభాలను కొంత మేర తగ్గించుకోవడం ద్వారా ప్రజలకు ఉపసమనం కలిగించాలని సూచించారు. అధిక ధరలు వసూలు చేస్తే 1800 425 2532 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. డీఎస్‌వో ఉదయ్ భాస్కర్, మార్కెటింగ్ శాఖ అధికారి విశాలాక్ష్మి పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు పచ్చజెండా

త్వరలో నోటిఫికేషన్ విడుదల

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16 నుంచి నవంబరు 24 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 40 రోజుల వ్యవధిలో ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ప్రాంతాల వారీగా రైతుల జాబితాను సేకరించాలని ఆదేశించారు. జిల్లాలో సెంట్రల్ డెల్టా పరిధిలో 9 డిస్ట్రిబ్యూటరీ, 56 నీటి వినియోగ సంఘాలు, తూర్పు డెల్టా పరిధిలో 8 డిస్ట్రిబ్యూటరీ, 32 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధి విధానాలు త్వరలోనే విడుదల చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జలవనరులు శాఖ ఇంజినీర్లు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. ● మంగళవారం అమరావతి నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దూరదృశ్య సమావేశం నిర్వహించి సాగు నీటి సంఘాల ఏర్పాటుపై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు.



సాగు నీటి సంఘాల ఏర్పాటుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

'వైమానిక దళం' భారత్‌కు గొప్ప ఆస్తి

గాంధీనగర్, న్యూస్‌టుడే: అసమానమైన శౌర్యం, సమగ్రతతో దేశానికి సేవ చేసిన వైమానిక యోధులకు ఇది నివాళి అని, ఇది భారత సైనిక శక్తికి గొప్ప ఆస్తి అని వింగ్ కమాండర్ ఎన్‌సీసీ పి.ప్రవీణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జేఎన్‌టీయూకేలో 9(ఆంధ్ర) వైమానిక ఎన్‌సీసీ కాకినాడ విభాగం ఆధ్వర్యంలో వైమానిక దళ దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ వైమానిక దళ ప్రాముఖ్యతను వివరించారు. సాధారణంగా మొదలై ప్రపంచంలోని బలీయమైన దళాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. వింగ్ కమాండర్ ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ దశాబ్దాలుగా సాంకేతికత, అంకితభావం, వృత్తి నైపుణ్యం, ధైర్యం ప్రదర్శించిందన్నారు. ఈ సందర్భంగా కేకు కోసి వేడుకలు నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కల్నల్ సీకే.నాయక్, గర్ల్స్ విభాగ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్‌ఎస్.మాణిక్, కోస్టుగార్డ్ కమాండింగ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్, విశ్రాంత గ్రూప్ కెప్టెన్‌లు ఐవీఆర్.రావు, హెచ్‌ఎస్.బాలి, ఏఎన్ఓలు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.


వేడుకల్లో కేకు కోస్తున్న జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ, కాకినాడ గ్రూప్ కల్నల్ నాయక్

బాలికపై అమానుష ఘటన బాధాకరం: వర్మ

పిఠాపురం: పిఠాపురంలో బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన అమానుషమని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పిఠాపురంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడిన తెదేపా కార్యకర్త దుర్గాడ లక్ష్మణ్ అలియాస్ జాన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన, సహకరించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇలాంటి ఘటనలను తెదేపా ఖండిస్తుందన్నారు. వైద్యంకోసం బాధితురాలిని కాకినాడ పంపించారని, అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామన్నారు. పిఠాపురంలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని కోరారు. ప్రధాన కూడళ్లలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయని, ముఖ్యంగా చిత్రాడ, రథాలపేట, మాధవపురం రైల్వే వంతెనల వద్ద గస్తీ నిర్వహించాలన్నారు. మద్యం తాగి, మత్తుకు బానిసై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. నాయకులు సూర్యప్రకాష్, చిన్నా, శ్రీను, నగేష్, రాజా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది భర్తీకి దరఖాస్తులు

కాకినాడ నగరం: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధనేతర సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా ఇన్‌ఛార్జి ఏపీసీ పి.రమేష్ తెలిపారు. ఒప్పంద (కాంట్రాక్టు), పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పోస్టులను భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో టైప్-3 కింద హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 3, వాచ్‌మన్ 2, స్కావెంజర్ 4, స్వీపర్ 2 పోస్టులు భర్తీ చేస్తారన్నారు. టైప్-4 కింద అసిస్టెంట్ కుక్ 1 పోస్టును భర్తీ చేస్తారని వివరించారు. సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ కేటగిరీకి 18-42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 5 ఏళ్లు, మాజీ సైనికోద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుందన్నారు.

దుర్గామాతా.. నమోస్తుతే


మామిడికుదురు: పాశర్లపూడిలోని కొట్టుమెరకలో రూ.2.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ


ముమ్మిడివరం మండలం గోదశివారిపాలెంలో రూ.25 లక్షల నగదుతో మహాలక్ష్మీదేవిగా..


ద్వారపూడిలో కరెన్సీ నోట్లతో అలంకరించిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు


రౌతులపూడిలో దుర్గాదేవిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి దేవిగా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవార్లను రోజుకో రూపంలో అలంకరించి పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో మంగళవారం అమ్మవార్లను కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం

అతివల ఆర్థిక స్వావలంబన

అంగర, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలంతా ఒక్క చోటుకి చేరి సంఘంగా ఏర్పడ్డారు. నైపుణ్య శిక్షణ తీసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ఉపాధి అవకాశాలు స్వయంగా సృష్టించుకుని, మరికొందరిని అందులో భాగస్వాములను చేస్తున్నారు.

కపిలేశ్వరపురంలో విల్లియం మేయర్ మహిళా సంఘం 2004లో ఏర్పడింది. సిస్టర్ ఫిలో అగస్టిన్ ఆధ్వర్యంలో నాడు మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించారు. 2011లో సంఘంగా రిజిస్ట్రేషన్ చేయించి, స్వయం ఉపాధి మహిళా సంఘాలను ఏర్పాటు చేశారు. సంఘం సమన్వయ కర్తలుగా పనిచేసిన ఎంతోమంది మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు పరిచారు.

సంఘం ప్రత్యేకతలు ఇవీ

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ, కుట్లు, అల్లికలు, క్రాఫ్ట్, మగ్గం వర్కు నేర్పిస్తారు. వాటిని బయట ఏజెన్సీలకు విక్రయించి లాభాల్ని పంచుతారు. తాతపూడిలో మరో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మహిళలకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, వారిని ఓపెన్‌స్కూల్, యూనివర్సిటీ ద్వారా పది, ఇంటర్ పరీక్షలు రాయిస్తున్నారు. ఇంట్లో ఉన్న చెత్తతో ఎరువు తయారు చేయించి పెరటి సాగును ప్రోత్సహిస్తున్నారు. ఫినాయిల్, నీలిమందు, జెండూబామ్, పెయిన్ ఆయిల్, వేజిలైన్, కరబంద టానిక్, కిడ్నీ స్టోన్ టానిక్ తయారు చేయడం నేర్పిస్తున్నారు.


ఫినాయిల్ కలపడంలో శిక్షణ తీసుకుంటూ

పొదుపు ఆవశ్యకతపై...

ప్రస్తుతం 24 గ్రూపులుగా, 261 మంది సభ్యులు సంఘంలో ఉన్నారు. అంగర, మాచర మట్టలు, తాతపూడి, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, సత్యనారాయణపురం గ్రామాలకు చెందిన మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తు అవసరాల కోసం కొంత సొమ్ము పొదుపు చేసేలా ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే సంఘం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తారు. విద్యా కమిటీ, ఆరోగ్య కమిటీ, సాంఘిక కమిటీలుగా సభ్యులను విభజించారు. వారు ప్రతి వారం ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు సందర్శించి, అక్కడ మౌలిక వసతులపై ఆరా తీస్తారు. యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ, విద్యార్థులకు ట్యూషన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.


కుట్టు శిక్షణలో మహిళలు

భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు

విల్లియం మేయర్ మహిళా సంఘం ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. వాటి సంఖ్యను భవిష్యత్తులో మరింత పెంచేందుకు కృషి చేస్తున్నాం. సమాజంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే అభిరుచితో సంఘం ఏర్పాటు చేశాం. దీని ద్వారా మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి సాధించగలుగుతున్నారు.

- సిస్టర్ జ్యోతి, విల్లియం మేయర్ మహిళా సంఘం సమన్వయకర్త, కపిలేశ్వరపురం

నవంబరులో ఏపీ సాంస్కృతిక వైభవం సదస్సు

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం) న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో నవంబరు 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు నిర్వహించనున్నామని వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను వర్సిటీలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ఆంగ్ల విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని వివరించారు. కన్వీనర్లుగా ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.ఎన్.సజనారాజ్ వ్యవహరిస్తారని వెల్లడించారు.


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు

పత్ర సమర్పణలకు ఆహ్వానం..

రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలను ఆహ్వానిస్తున్నామని వీసీ తెలిపారు. అవధానం, దండకం, శతకం, పద్య కవిత్వం తదితర సాహిత్య ప్రక్రియలు, కూచిపూడి, ఆంధ్ర నాట్యం, థింసా గిరిజన నృత్యాలు, జానపద కళారూపాలు, బుర్రకథ, హరికథ, తోలుబొమ్మలాట, తప్పెటగుళ్లు, మొదలైన సాహిత్య జానపద, సాంస్కృతిక అంశాలపై రచనలు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, సంస్కృతి, ఆహారపు టలవాట్లు, వస్త్రధారణ రీతులు, శిల్ప నిర్మాణ శాస్త్రాలు, క్రీడలు, పండుగలు, ఉత్సవాలు, హస్త కళారూపాలు, జీవన విలువలు, సంస్కరణలు, సేవాభావం, విశ్వబంధు భావన తదితర సాంస్కృతిక అంశాలపై సదస్సులో చర్చలు ఉంటాయన్నారు.

25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్..

సదస్సులో పాల్గొనేవారు ఈనెల 25లోగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, పరిశోధన పత్రాలు సమర్పించాలని వీసీ కోరారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ. వెబ్‌సైట్ నుంచి పొందాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కాప్స్ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, ఓలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లెప్టినెంట్ గవర్నర్‌ను కలిసిన మల్లాడి

యానాం: యానాం పర్యటనకు ముందే ఇక్కడ పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలను పరిష్కరించాలని పుదుచ్చేరి లెప్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాదన్‌ను ఆ రాష్ట్ర దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. లెప్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాదన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్‌లను కృష్ణారావు మంగళవారం కలిశారు. యానాంలో చోటుచేసుకున్న పలు విషయాలను ఆయన గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. పుదుచ్చేరిలో పనిచేస్తున్న యానాం ఉద్యోగులను ఇక్కడకు బదిలీ చేయాలని కోరారు. సాయి స్పోర్ట్స్ అథారిటీ, జీఎస్‌ఎం కళాశాలలకు స్థలం బదలాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో కృతజ్ఞతలు తెలిపానన్నారు.


పుదుచ్చేరి లెప్టినెంట్ గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లాడి కృష్ణారావు

గర్భస్థ లింగనిర్ధారణపై కఠిన చర్యలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గర్భస్థ పిండ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు నిర్వహించే పరీక్షలు దుర్వినియోగం కాకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఫలితాలు బహిర్గతం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధ అమ్మకాలపై అధికారులు నిఘా ఉంచాలన్నారు. డీఎంహెచ్‌వో దుర్గారావు దొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచన కవితల పోటీకి ఆహ్వానం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటకు చెందిన అరిగెల బలరామమూర్తి సాహిత్య కళావేదిక ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వచన కవితల పోటీలను నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ.. 'పర్యావరణ పరిరక్షణ-పర్యావరణ సమతుల్యత' అంశంపై 20-25 పంక్తులకు మించని కవిత రాసి పంపాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వారు మాత్రమే పోటీకి అర్హులన్నారు. ఈ నెల 31 చివరి తేదీ అన్నారు. ఎంపికైన కవితకు రూ.5 వేలు, జ్ఞాపికతో పాటు కవికి సత్కారం ఉంటుందన్నారు. దీపక్‌రాజ్, పరసా సుబ్బారావు, డా.శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సాయం.. మెరుగైన వ్యవసాయం

న్యూస్‌టుడే – ఆలమూరు, కొత్తపేట

విప్లవాత్మక సాంకేతిక మార్పులతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. పంటకు సోకిన చీడపీడల నివారణకు పురుగు మందుల దుకాణదారులు ఇచ్చిన వాటిని తీసుకొచ్చి రైతులు వినియోగిస్తున్నారు. ఇకపై అన్నదాతలు సాంకేతికతను ఉపయోగించి మెరుగైన చీడపీడల నివారణ చేసే విధంగా వ్యవసాయశాఖ దృష్టి పెట్టింది. నేరుగా శాస్త్రవేత్తలను సంప్రదించి క్రిమిసంహారక మందులు వినియోగించే విధంగా చర్యలు చేపట్టింది.

డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వివరాలు	
వరిసాగు విస్తీర్ణం	1,57,716 ఎకరాలు
ఈకేవైసీ పూర్తి	96 శాతం
ఈ పంట నమోదు	100 శాతం

సీఎల్ఎస్ అండ్ పీడీఎస్ఎస్ యాప్

కూటమి ప్రభుత్వం తాజాగా సీఎల్ఎస్ అండ్ పీడీఎస్ఎస్ (క్రాప్ లైఫ్ సిస్టమ్ అండ్ పెస్ట్ అండ్ డిసీజెస్ సర్వైలెన్స్ సిస్టం) అనే నూతన యాప్‌ను విడుదల చేసింది. గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు (వీఏఏ) సంబంధిత రైతుల పొలం వద్దకు వెళ్లి సాగు చేసిన పంటల వివరాలు, తెగుళ్లు, సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి యాప్ నమోదు చేస్తారు. జిల్లా వనరుల కేంద్రంతో శాస్త్రవేత్తలకు పరిశీలించి యాప్ ద్వారా పరిష్కారాలు సూచిస్తారు. కర్షకుల చరవాణి నంబరు యాప్‌లో పొందుపరచడం వల్ల నేరుగా వారికి సమాచారం అందుతుంది. వీఏఏలు కూడా అన్నదాతలకు అవగాహన కల్పించి సూచనలు చేస్తారు. యాప్‌ను జిల్లా, డివిజన్, మండల వ్యవసాయాధికారులు పర్యవేక్షిస్తారు.

అన్నదాతలకు ఉపయోగకరం

ఈ యాప్ అన్నదాతలకు ఉపయోగకరం. దీనిపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ పూర్తయింది. పంటలకు సోకిన తెగుళ్లకు సరైన క్రిమిసంహారక మందుల వివరాలు రైతులకు చేరేందుకు ఇది సహాయపడుతుంది. మారుమూల గ్రామాలకు సైతం ఎక్కడో ఉన్న శాస్త్రవేత్తల సూచనలు అందడానికి తోడ్పడుతుంది.

- బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా


యాప్‌లో పంట వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

సరదాగా తిరుగుదామని చెప్పకుండా వచ్చేశారు..
నలుగురు బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

దానవాయిపేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన నలుగురు బాలికలు దసరా సెలవుల వేళ ఇంట్లో చెప్పకుండా వేరే ప్రాంతానికి బయలుదేరారు. మహిళా రక్షక్ పోలీసులు వీరిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం మహిళా స్టేషన్ సీఐ మంగాదేవి వివరాల మేరకు.. ఈ నెల 7న అర్ధరాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు బాలికలను మహిళా రక్షక్ టీమ్ ప్రశ్నించింది. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. వారిలో ఇద్దరు రాజమహేంద్రవరానికి చెందిన వారు కాగా.. మరో ఇద్దరు రావులపాలెం ప్రాంతానికి చెందిన బాలికలుగా గుర్తించారు. ఇద్దరు పదో తరగతి, మరో ఇద్దరు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నలుగురికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. విజయదశమి సెలవులు కావడంతో నాలుగు రోజులు పాటు విశాఖకు వెళ్లి సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. ఇంట్లో చెబితే ఒప్పుకోరని ఆలయానికి వెళ్తామని కుటుంబీకులకు చెప్పి సోమవారం మధ్యాహ్నం బయటకు వచ్చేశారు. రాత్రి రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. మంగళవారం ఉదయం వీరి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం బాలికలను అప్పగించినట్లు సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ రక్షక్ టీమ్‌ను అభినందించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విశాఖలో వాహనం.. తునిలో గొలుసు దొంగతనం
మహిళ మెడలో ఆభరణాలు లాక్కెళ్లిన దుండగులు

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ఎంవీపీ కాలనీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ఖరీదైన బైక్‌ను ఇద్దరు దుండగులు చోరీ చేశారు. తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో ఈ బైక్ చోరీ జరిగినట్లు అక్కడి సీసీ కెమెరాలో దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం సుమారు 100 కి.మీ. దూరంలో తుని పట్టణానికి అదే బైక్‌పై వచ్చి సంచరించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఓ గ్రామీణ ప్రాంత మహిళను లక్ష్యంగా చేసుకుని దుండగులు మధ్యాహ్నం 3.30 గంటలకు మెడలోని సుమారు 40 గ్రాముల బరువు ఉన్న రూ.2.50 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు లాక్కెళ్లిపోయారు. ఈ చోరీ దృశ్యాలు కూడా దగ్గరలోని ఓ దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి. విశాఖలో బైక్ చోరీ చేసిన సమయానికి సరిగ్గా 12 గంటల వ్యవధిలో ఇక్కడ చోరీ జరగడం గమనార్హం. మండలంలోని వెలమకొత్తూరు నుంచి పట్టణంలోని వస్త్ర దుకాణానికి వచ్చిన బాధితురాలు లక్ష్మీ తిరుగు ప్రయాణమైన సందర్భంలో ఈ దాడి జరిగింది. ఇద్దరు చోరుల వయసు పాతికేళ్లలోపే ఉంటుంది. ప్రత్యేక బృందాలు గాలింపు ప్రారంభించాయి. దుండగులు విశాఖలో దొంగిలించిన బైక్‌పైనే ఇటు వచ్చి చోరీ చేశారని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. తుని నారాయణ రాజుగారి వీధిలో చోరీ చేశాక మెయిన్ రోడ్డు నుంచి బెల్లపువీధి వైపు వెళ్లిన దుండగులు మళ్లీ అటు విశాఖ వైపునకు వెళ్లారా? లేక రాజమహేంద్రవరం వైపు పయనం అయ్యారా? అనేది పరిశీలిస్తున్నారు.


విశాఖలో బైక్ చోరీ చేస్తున్న దుండగులు


తునిలో మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కొనిపోతున్న చోరులు

కొండుకుదురులో విషాదం
లోడు ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

తాళ్లరేవు, అయినవిల్లి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం 216వ జాతీయ రహదారి చొల్లంగి వద్ద కొబ్బరి కాయల లోడు ఆటో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామానికి చెందిన ర్యాలీ సత్తిరాజు(42) చిల్లరగా కొబ్బరికాయలు కొనుగోలు చేసి వాటిని అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటారు. మంగళవారం ఆటోలో కాకినాడ వైపు కొబ్బరికాయలు లోడు తీసుకువెళ్తున్న సమయంలో తాళ్లరేవు మండలం చొల్లంగి వద్ద ఆటో ప్రమాదవశాత్తు పంటకాలువలో పడిపోయింది. ఈసంఘటనలో ఆటోతో సహా కొబ్బరికాయలు ఆయనపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సత్యవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


సత్తిరాజు (పాత చిత్రం)


ప్రమాదానికి గురైన ఆటో

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్	
కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో	
ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

సేవాభావం అలవరుచుకోండి...


కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రావులపాలెం పట్టణం: విద్యార్థులంతా సేవాభావం అలవరుచుకోవాలని రావులపాలెం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రాంగణంలో తుప్పలను తొలగించి, మొక్కలు నాటారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే అనారోగ్యాలు దరి చేరవన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన వేంద్ర రమేష్‌కుమార్ మంగళవారం రూ.2,02,232 విరాళం అందజేశారు. వీరికి స్వామివారి జ్ఞాపిక అందించి దేవస్థానం పర్యవేక్షకుడు పులపర్తి రాంబాబు అభినందించారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రాంబాబు

మద్యం దుకాణాల కైవసానికి హోరాహోరీ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం అయిదేళ్లు మద్యం దుకాణాలు సొంతంగా నడిపింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు రిటైల్ మద్యం దుకాణాలు లాటరీ ద్వారా కేటాయించనుంది. 12వ తేదీ నుంచి కొత్త విధానం అమలులోకి రానున్నాయి. కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట మండలాలకు ప్రభుత్వం 25 దుకాణాలు కేటాయించింది. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉండటంతో నలుగురు, ఆరుగురు కలిసి దరఖాస్తు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ మద్యం విధానం వెల్లడైన తరువాత పాత సిండికేట్లు రంగంలోకి దిగారు. ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంతో దుకాణాలు నిర్వహించిన సిండికేట్లతో కలిసి చేద్దామనుకున్నప్పటికీ ఒప్పందం కుదరలేదని తెలుస్తోంది. ఆన్‌లైన్ విధానం కావడంతో ఎవరికి వారు దరఖాస్తులు చేస్తున్నారు. కూటమి నాయకులు ఒక్కో మండలంలో 50 దరఖాస్తులు చొప్పున నియోజకవర్గంలో 200 దరఖాస్తులు వేయాలని భావిస్తున్నారు. గ్రామాల వారీగా నలుగురు, ఆరుగురు కలిసి రూ.2 లక్షలు చొప్పున డీడీలు తీసేందుకు బ్యాంకులకు పరుగులు తీశారు. 9న దరఖాస్తులు వేసేందుకు నిర్ణయించుకున్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో అందిన దరఖాస్తుల వివరాలు..

మండలం	దుకాణాలు	8వ తేదీ వరకు..
రావులపాలెం	8	88
ఆత్రేయపురం	4	53
ఆలమూరు	4	65
కొత్తపేట	8	48

ఎక్సైజ్ కార్యాలయంలోనూ..

9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో లేదా రూ.2 లక్షలు డీడీ లేదా చలానా ద్వారా చెల్లించిన వారు ఎక్సైజ్ కార్యాలయంలోనూ దరఖాస్తులు ఇవ్వొచ్చు. – కాత్యాయణి, సీఐ, అబ్కారీ శాఖ, కొత్తపేట

కూడలిలో గుంత.. రక్షణ లేక కలత



రాజోలు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన తాటిపాకలో 216 జాతీయ రహదారి, పి.గన్నవరం వైపు వెళ్లే ర.భ. రహదారి ఆనుకుని ఫైబర్ కేబుల్ కోసం పెట్టిన పెద్దగుంత చుట్టూ ఏవిధమైన రక్షణ లేకపోవడంతో వాహనచోదకులు తల్లడిల్లిపోతున్నారు. బస్‌షెల్టర్‌కు వెళ్లే ప్రయాణికులు, అక్కడ మలుపు తిరిగే వాహనచోదకులు గుంతను చూసి హడలిపోతున్నారు. చుట్టూ ఏవిధమైన రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ ఏఈ సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా గుంత చుట్టూ రక్షణ చర్యలు చేపట్టేలా ఫైబర్ కేబుల్ నిర్వాహకులకు తెలియజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

ఆధ్యాత్మిక శిక్షణ.. ఉపాధికి రక్షణ..

ముక్కామల కేంద్రంగా నాదస్వరం, డోలు విద్యల్లో తర్ఫీదు

న్యూస్‌టుడే, అంబాజీపేట

ఆధ్యాత్మిక అగ్రహారంగా పిలిచే ముక్కామలలో ఇప్పటికే ఉన్న యజుర్వేద, శైవగామ వేద పాఠశాలలకు తోడుగా మరొక పాఠశాలలో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో నాదస్వరం, డోలు వాయిద్యాలపై తర్ఫీదు పొందుతున్నారు. గ్రామంలోని వీరభద్రుడి ఆలయం వద్ద ఈ పాఠశాలను కొనసాగిస్తున్నారు.


నాదస్వరం వాయిద్యాలతో విద్యార్థులు

నాదస్వరంలో సరిగమలను ఉప్పలపాటి నాని, డోలు వాయిద్యంలో పసుపులేటి వెంకటరమణ నేర్పిస్తున్నారు. ఇక్కడ 25 మంది విద్యార్థులు ఉషోదయం కంటే ముందుగానే ఈ శిక్షణ పొందుతున్నారు. వీటిని నేర్పించే గురువులకు కంచికామకోటి పీఠం నుంచి వేతనాలు అందిస్తున్నారు. ఈ విద్యల్లో పూర్తిస్థాయిలో నైపుణ్యం సంపాదించాలంటే దాదాపు అయిదేళ్ల పాటు సమయం పడుతుంది. ఈ అయిదేళ్లూ వారికి అన్ని వసతులు ఉచితంగానే సమకూరుస్తున్నారు.

గ్రామస్థుల విజ్ఞప్తితో..

గతంలో కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ముక్కామల గ్రామాన్ని సందర్శించినప్పుడు గ్రామస్థులు ఇక్కడ నాదస్వరం, డోలు శిక్షణ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్టణం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 5 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు ఇక్కడ విద్య నేర్చుకుంటూ స్థానిక పాఠశాలల్లో చదువుకుంటున్నారు.

తెల్లవారుజాము 4 గంటలకే..

విద్యార్థులకు తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 8.30 గంటల వరకు, సాయంత్రం 5.50 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. వీరు పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన తరువాత ఉద్యోగ, ఉపాధికి ఢోకా ఉండదని నిర్వాహకుడు, సమన్వయకర్త పసుపులేటి నాగబాబు చెప్పారు.

ఇష్టంతో నేర్చుకుంటున్నా..



పదోతరగతి వరకు చదువుకున్నాను. నాదస్వరం, డోలు సాధన ఇష్టం. మాది నర్సీపట్నం. గురువులు చక్కగా అవగాహన కల్పిస్తున్నారు. వసతులు బాగానే ఉన్నాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలతో పాటు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నారు.

- ఉప్పలపు శివరామకృష్ణ, విద్యార్థి, నర్సీపట్నం

ఉపాధి దొరుకుతుందని..



పదోతరగతి పూర్తిచేశాను. డోలు విద్యపై సాధన చేస్తున్నాను. శిక్షణ పొందిన తరువాత ఆయా ఆధ్యాత్మిక పట్టణాల్లో ఉపాధికి అవకాశం ఉంటుంది.

- చిక్కాల శివసూర్యనారాయణ, విద్యార్థి, సామర్లకోట

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం పట్టణం: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మంగళవారం రావులపాలెంలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి, తాగునీటి ట్యాంకుల నిర్మాణాలపై ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడైపోయిన రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. తెదేపా నాయకుడు బండారు సంజీవ్, అధికారులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే


బాధిత కుటుంబ సభ్యులతో దేవ వరప్రసాద్

మలికిపురం, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అభాగ్యులను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇటీవల మలికిపురం ఎత్తువంతెన వద్ద గన్నవరం పంట కాలువలో పడి మృతిచెందిన సఖినేటిపల్లి గ్రామానికి చెందిన చీర్ల దుర్గారావు కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో చెక్కు రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సుబ్రహ్మణ్యానికి సత్కారం

అంబాజీపేట, న్యూస్‌టుడే: తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి మాజీ అధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన ఆ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఇంటివద్ద సత్కరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి డీవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పబ్బినీడి రాంబాబు, అయినవిల్లి మండల తెదేపా అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎస్.మూలపొలంలో సినీ సందడి

అయినవిల్లి: ఎస్.మూలపొలంలో మంగళవారం నవ్య ఆర్ట్స్ నూతన చిత్ర నిర్మాణం సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది. నటుడు తేజ్‌పై కొబ్బరితోటల్లో సన్నివేశాలు చిత్రీకరణ చేశారు. పది రోజుల పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పలు సన్నివేశాలు తీయనున్నట్లు యూనిట్ సిబ్బంది తెలిపారు.

భవానీ దీక్షాధారుల పడిపూజ



రావులపాలెం గ్రామీణం: రావులపాడులో భవాని దీక్షధారులు గురుభవాని సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భవాని మాలధారులు పాల్గొని పూజలు చేశారు.

కూటమి ప్రభుత్వం విజయవంతంగా సాగాలని...

సఖినేటిపల్లి: సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా కొనసాగాలని కోరుతూ అంతర్వేదికర-గొంది సరిహద్దు గంగయ్య వారధి వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో సఖినేటిపల్లి తెదేపా బీసీసెల్ అధ్యక్షులు కొల్లు మహాలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికులక్షత్రియ సాధికార కమిటీ సభ్యుడు తిరుమాని ఆచార్యులు, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పర్తి నాని పాల్గొన్నారు.

బేతాళస్వామి వాహన ఉత్సవానికి రండి..


మంత్రి సుభాష్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఈ నెల 16న అంబాజీపేటలో శెట్టిబలిజ అభ్యుదయ సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయబేతాళస్వామి వాహన మహోత్సవానికి రావాలని కమిటీ సభ్యులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. మంగళవారం కమిటీ సభ్యులు మంత్రి ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు.

★ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మాచవరం భవానీ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని ఆయన స్వీకరించారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. పశువులసంత కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో పద్మలత, రైతులు

కొత్తపేట: వరిలో సరైన సస్యరక్షణ విధానాలు అవలంబిస్తే మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని ఏవో పద్మలత అన్నారు. మంగళవారం మోడేకుర్రులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆధునిక సాంకేతిక పద్ధతులు, క్షేత్రస్థాయి సమస్యలపై పరిష్కారాలను రైతులకు తెలియజేశారు. పొలంలో బాక్టీరియా ఆకు తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 450 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం బాగు

సఖినేటిపల్లి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం బాగుంటుందని ఏవో పీవీ నరసింహారావు, ప్రకృతి వ్యవసాయ అధికారి జూలి అన్నారు. సఖినేటిపల్లిలంక, రామేశ్వరంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వరి పంటకు వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కొబ్బరి నిల్వచేసే ప్యాక్ హౌస్‌లు, కాయని చెట్ల తొలగింపు వంటి పథకాలను రైతులకు తెలియజేశారు. చెట్ల ఆకులు, ఆవుపేడ, ఆవు మూత్రం ఉపయోగించి ఎరువులను తయారు చేసుకుని వాడాలన్నారు. సర్పంచులు రేవూరి రాజేశ్వరి, ఉమామహేశ్వరరావు, మధురాజు, మీనాక్షి పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: రైతులకు ఉద్యాన, వ్యవసాయశాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఏడీఏ రామ్మోహనరావు, అంబాజీపేట హెచ్‌ఈవో డి.వెంకటేశ్వరరావు కోరారు. చిరుతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో మంగళవారం సర్పంచులు కోట బేబిరాణి, తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ఏవో డి.విజయకుమార్, ఏఈవో దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

గోదావరిలో పడి మత్స్యకారుడి మృతి


వీర్రాజు (పాత చిత్రం)

బొబ్బర్లంక (ఆత్రేయపురం): చేపలు వేటాడుతుండగా ప్రమాదవశాత్తు గోదావరిలో పడి బొబ్బర్లంకకు చెందిన మత్స్యకారుడు గోసాల వీర్రాజు (65) మంగళవారం మృతి చెందాడు. బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువన ఉదయం చేపల వేటకు వెళ్లగా, అదుపు తప్పి వలతో సహా గోదావరిలో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించగా అతడు పడిపోయిన సమీపంలో మృతదేహం కనిపించింది. అతడికి భార్య సుబ్బాయమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న ఇంటి యజమాని ప్రమాదంలో మృతి చెందడంతో తమకు దిక్కెవరంటూ కన్నీరు మున్నీరవుతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసు కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

రావులపాలెం పట్టణం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రావులపాలేనికి చెందిన పెనుమత్స శివరామరాజు (60) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆయన జాతీయ రహదారి చెంతన ఒక దాబాలో సప్లయిర్‌గా పనిచేస్తున్నారు. టీ తాగేందుకు కూడలికి వెళ్లి తిరిగి దాబా వద్దకు వస్తుండగా తణుకు వైపు నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో శివరామరాజు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా ప్రాంతానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. పి.గన్నవరం: లంకలగన్నవరం గ్రామానికి చెందిన గనిశెట్టి బాలకృష్ణ(57) కుటుంబ సభ్యులపై కోపంతో ఈ నెల 5న ఇంటినుంచి వెళ్లిపోయారు. కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివకృష్ణ తెలిపారు.

ఊడిమూడిలో మహిళ.. ఊడిమూడికి చెందిన మహిళ(45) గత నెల 30 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జనని.. శుభకారిణి..


ఈదరాడలో సామూహిక కుంకుమార్చన


మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయంలో..

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో పూజలందుకున్నారు. అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో భక్తులు ఆలయాలకు పెద్దఎత్తున తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు, రావులపాలెం పట్టణం, గ్రామీణం, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట, అంబాజీపేట, పి.గన్నవరం


ఉచ్చిలిలో..


ర్యాలిలో శాకంబరిగా..


ఆలమూరు రావులమ్మ


కూనవరం బాలకనకదుర్గ


అంబాజీపేట వాసవీమాత


గుడిమెళ్లంకలో...

భాజపా శ్రేణుల సంబరాలు..

మామిడికుదురు: హరియాణాలో భాజపా మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకోవడంతో ఆ పార్టీ మండల శ్రేణులు స్థానికంగా మంగళవారం హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నాయకులు కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మిరావు, గాడి సత్తిబాబు, వేగి వెంకటేశ్వరరావు, భైరిశెట్టి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

దింపు కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మలికిపురం: ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుడిమెళ్లంక గ్రామానికి చెందిన దింపు కార్మికుడు కడియాల పెదమనియ్య కుటుంబానికి శ్రీసింహాద్రి కొబ్బరి దింపు కార్మికుల జిల్లా సంఘం రూ.30 వేల ఆర్థిక సాయాన్ని సమకూర్చింది. గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో రాజోలు సీఐ నరేశ్‌కుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘ అధ్యక్షుడు గుత్తుర్తి పాండురంగారావు, గండిబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం ఎంపీడీవోగా బాలాజీ

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం ఎంపీడీవోగా నిమ్మగడ్డ బాలాజీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.మంగాదేవి అమలాపురం బదిలీపై వెళ్లారు. రాజోలు ఎంపీడీవోగా పనిచేస్తున్న బాలాజీ మలికిపురం మండల పరిషత్తుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సూపరింటెండెంట్ జి.మిల్టన్, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి: సీపీఐ


మాట్లాడుతున్న సత్తిబాబు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సీపీఐ కార్యదర్శి కె.సత్తిబాబు కోరారు. సఖినేటిపల్లిలో మంగళవారం ఆ పార్టీ సమావేశం జరిగింది. సత్తిబాబు, రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిత్యావసర సరకుల విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వం అశ్రద్ధ చేస్తోందన్నారు. సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలో చౌకడిపోల ద్వారా 16 రకాల నిత్యావసర సరకులు తక్కువ ధరకే అందజేస్తారని, అదే తరహాలో రాష్ట్రంలో కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో విద్యుత్తు సౌకర్యం మెరుగుపరచాలని, సీసీరోడ్లు వేయాలని, మహిళల అభివృద్ధికి ఫ్యాషన్ డిజైన్ వంటి శిక్షణలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెడ్డం ప్రభాకరరావు, వసంతరావు, చింతా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు సిద్ధం కండి..


సమావేశంలో మాలమహానాడు నాయకులు

మలికిపురం: ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి త్యాగాలకు సిద్ధం కావాలని ఐకాస నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మలికిపురం జీపీఆర్ గ్రౌండ్స్‌లో గెడ్డం ఫిలిప్‌రాజు అధ్యక్షతన జరిగిన నాలుగు మండలాల మాలల న్యాయపోరాట సమితి సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై రివ్యూ పిటిషన్‌ను తోసిపుచ్చడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్గీకరణను అడ్డుకోవడానికి న్యాయపోరాట సమితి, ఐకాసల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని నిర్ణయించారు. దీని నిమిత్తం నాలుగు మండలాల ఐకాస ప్రధాన కార్యదర్శిగా మట్టా ఏడుకొండలు, కోశాధికారిగా బత్తుల జనార్దనరావు, ఉపాధ్యక్షులుగా కలిగితి పల్లంరాజు, రాపాక మహేశ్‌కు బాధ్యతలు అప్పగించారు. గెడ్డం తులసీభాస్కరరావు, గోనిపాటి రాజు, నల్లి రమణమూర్తి పాల్గొన్నారు.

సమస్యలనేకం... చర్చిస్తేనే ప్రయోజనం

నేడు పి.గన్నవరం మండల పరిషత్ సమావేశం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై అధికారులు, సభ్యులు దృష్టిపెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలంతా కోరుతున్నారు.


వరదల సమయంలో ట్రాక్టర్‌పై వస్తున్న శివాయిలంక ప్రజలు

ప్రధానంగా ఇవీ..

★ జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ సద్వినియోగంలోకి రాకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నరేంద్రపురంలో అదనపు సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

★ గోదావరి వరదలకు శివాయిలంక, కె.ఏనుగుపల్లిలంక ప్రజలు ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు మునిగిపోయి బయటకు రావడానికి పడవలను, ట్రాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తుంది. ఈ రెండుచోట్ల కాజ్‌వేలు నిర్మిస్తే ప్రయోజనం చేకూరుతుంది. కాజ్‌వేలు నిర్మిస్తామంటూ పాలకులు ఇస్తున్న హామీలు అమలు కావడంలేదు.

★ కుందాలపల్లి నుంచి జి.పెదపూడి వెళ్లే రహదారి పుష్కరకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. దీనిని పంచాయతీరాజ్‌శాఖ నుంచి ర.భ.శాఖకు బదలాయిస్తామంటూ గతంలో ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. ఈ రహదారి దారుణంగా తయారైంది.

★ ఇసుక లభించక గృహనిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గోదావరి వరద పూర్తిగా తగ్గిపోయింది. రేవులను గుర్తించి ఇసుక తీస్తే కొరత తీరుతుంది.

★ నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లితో పాటు మరికొన్ని గ్రామాలు లోవోల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. నాగుల్లంకలో కొత్తగా విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ప్రతిపాదనలు వెళ్లాయి.

★ ర.భ.శాఖకు సంబంధించి వివిధ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

★ నాగుల్లంకలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉన్నప్పటికీ ప్రసవాలు జరిగేలా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

★ నాడు-నేడు పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. వెల్‌నెస్ సెంటర్లు, కొన్ని రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణాల పరిస్థితి కూడా అలాగే ఉంది.

★ పోతవరంలో అగ్రిల్యాబ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

తెదేపా నాయకులకు ఎమ్మెల్యే పరామర్శ

ఆత్రేయపురం: ఇటీవల అస్వస్థతకు గురయిన తెదేపా నాయకుడు, వాడపల్లి దేవస్థానం మాజీ ఛైర్మన్ కరుటూరి నరసింహారావును రాజమహేంద్రవరంలోని ఆయన ఇంట్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. అలాగే బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెదేపా నాయకుడు టి.సాయికృష్ణను పరామర్శించారు.

అధ్యాపకుల రిలే నిరాహార దీక్షలు

మలికిపురం: జీతాల కోసం రిలే దీక్షలు చేస్తున్న తమను పాలకవర్గం పట్టించుకోకపోవడం దారుణమని ఎంవీఎన్, జేఎస్, ఆర్‌వీఆర్ కళాశాల అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ సమస్యను పట్టించుకోకుండా పక్కదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీకేవీ కళాశాల అధ్యాపకులు, ఇతర ప్రముఖులు మద్దతు తెలిపారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

అసాంఘిక కార్యకలాపాలు సహించేది లేదు


మాట్లాడుతున్న ఎస్సై అవినాష్

కాట్రేనికోన: దసరా పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, అశ్లీల నృత్యాలు వంటివి నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై అవినాష్ హెచ్చరించారు. పండుగవేళ చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించరాదని మంగళవారం గచ్చకాయలపోర గ్రామంలో స్థానికులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మునేంద్ర, స్థానికులు పాల్గొన్నారు.

చింతలమెరకలో మంత్రి పూజలు



కాట్రేనికోన, న్యూస్‌టుడే: చింతలమెరకలో నూతనంగా నిర్మించిన విజయలక్ష్మీదుర్గ ఆలయంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిమ్మాపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న బి.సురేష్‌కుమార్‌ను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.

శ్రీమహాలక్ష్మికి సిరికాంతులు


శ్రీమహాలక్ష్మి రూపంలో అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారు, శ్రీవైష్ణవి కనకదుర్గ, వేపచెట్టు శ్రీకనకదుర్గ, భవానీనగర్ కల్యాణదుర్గ, శ్రీకామాక్షి ఏకాంబరేశ్వరి, కాలేజీరోడ్డులోని బాలా త్రిపురసుందరి దేవి


శ్రీకామాక్షి ఏకాంబరేశ్వరి ఆలయం వద్ద కుంకుమ పూజలు


శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి మండపంలో ఆయోధ్య రామబాణం

అమలాపురం పట్టణం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, న్యూస్‌టుడే: విజయదశమి మహోత్సవాల్లో భాగంగా అమలాపురం పట్టణంలోని ఆలయాల్లో అమ్మవార్లు మంగళవారం శ్రీమహాలక్ష్మి రూపంలో పూజలు అందుకున్నారు. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శ్రీకామాక్షి ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. ఎర్రవంతెన వేద మాత గాయత్రీ నిలయం వద్ద సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. ● సన్నవిల్లి కనకదుర్గమ్మ అమ్మవారిని రూ.1.5 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ● పల్లవారిపాలెంలో అమ్మవారిని రూ.5 లక్షలు నగదుతో అలంకరించారు. ముమ్మిడివరంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద భవానీ భక్తులు నిప్పుల గుండంలో నడిచారు.


రూ.1.5 లక్షల కరెన్సీతో లక్ష్మీదేవి అలంకరణలో సన్నవిల్లి కనకదుర్గమ్మ


చినకొత్తలంకలో నగదుతో మహాలక్ష్మీదేవిగా అమ్మవారి అలంకరణ


యానాంలో లక్ష్మీదేవి అవతారంలో

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకం

అల్లవరం, న్యూస్‌టుడే: గోడిలంక, దేవగుప్తం గ్రామాల్లోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గోడిలంక సహకార సంఘానికి ఆ శాఖలో రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శివన్నారాయణను, దేవగుప్తం సహకార సంఘానికి సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.విజయ్‌కుమార్‌ను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించారు.

యానాంలో కార్యాలయాల పరిశీలన

యానాం, న్యూస్‌టుడే: యానాంలోని ప్రభుత్వ కార్యాలయాలను దిల్లీ నుంచి వచ్చిన శిక్షణా ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. మిని సివిల్ స్టేషన్‌తో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అక్కడ పరిస్థితులను, పరిపాలనా విధానాలను అధికారులతో చర్చించి తెలుసుకున్నారు. * పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.శరత్‌చౌహాన్ వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ప్రధాన శాఖల అధికారులు పాల్గొన్నారు.


సివిల్ స్టేషన్‌ను సందర్శిస్తున్న శిక్షణ ఐఏఎస్ అంకిత్‌కుమార్

ఆలయ ఇన్‌ఛార్జిగా వెంకన్న

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్‌గా మాజీ కౌన్సిలర్ జంగా అబ్బాయి వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈవో డి.సాయిబాబు ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వదించారు. గత పాలకవర్గం రాజీనామా చేయడంతో నూతన పాలకవర్గం వచ్చేవరకు ఆయన పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా వెంకన్నను పలువురు తెదేపా నాయకులు అభినందించారు.

చీకట్లు.. జనం ఇక్కట్లు

పట్టణంలో వెలగని వీధిదీపాలు


పురపాలక కార్యాలయం వద్ద పనిచేయని వీధిదీపాలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా.. అమలాపురం పట్టణంలో అంధకారం తొలగడం లేదు. చీకట్లో రాకపోకలు సాగించలేక పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నివీధుల్లో ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చీకట్లో నడిచి వెళ్తుంటే కుక్కలు వెంటపడి దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

గ్రేడ్ -1 పురపాలక సంఘమైనా వీధిదీపాల గురించి పట్టించుకోవడం లేదు. పట్టణంలో 3,820 వీధిదీపాలు ఉండగా వెయ్యి వరకు వెలగడం లేదు. ప్రధాన రహదారులు, పలు వీధుల్లో అంధకారం అలముకుంటుంది. వైకాపా పాలనలో రూ.10 లక్షలతో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశామని ప్రకటించినా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. నిత్యం ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు పయనించే నల్లవంతెన, ఎర్రవంతెన మధ్య కాటన్ మార్గ్‌లో వీధి. దీపాలు వెలగడం లేదు. ఇక్కడ ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు దీపాల స్థంభాలు రవాణా చేసిన వాటిని ఏర్పాటు చేయడం లేదు. తమ వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడం లేదని ప్రతిపక్ష కౌన్సిలర్లు వాపోతున్నారు.

ప్రధాన రహదారిలోనే దిక్కులేదు..

నల్లవంతెన బైపాస్‌రోడ్డులో విద్యుత్తు దీపాలు లేవు. ఈ ప్రాంతంలో మూడు మద్యం దుకాణాలు ఉన్నాయి. చీకటి పడితే చాలు రోడ్డుపక్కనే ఆకతాయిలు మద్యం తాగుతున్నారు. అటువైపు వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. చీకట్లో కొంత మంది దాడులకు దిగుతున్నారని ఆ మార్గంలో వెళ్లేవాళ్లు వాపోతున్నారు. విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. ఇరువైపులా చెత్త పేరుకుపోవడంతో చీకట్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.


అమలాపురంలోని కె.అగ్రహారంలో అంధకారం

త్వరలోనే పరిష్కరిస్తాం

పట్టణంలో వీధిదీపాలు వెలగడం లేదని ప్రతిపక్ష కౌన్సిలర్లు మా దృష్టికి తీసుకువస్తున్నారు. ఆరు నెలలకు రూ.35 లక్షలతో వీధిదీపాలు వెలిగించేందుకు ఒక సంస్థకు అప్పగించాం. రూ.5 లక్షలతో వీధిదీపాలు కొనుగోలు చేస్తున్నాం. పట్టణంలో త్వరలోనే వీధిదీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం.

-కె.వి.వి.ఆర్.రాజు, మున్సిపల్ కమిషనర్

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సదస్సు


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

యానాం, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా యానాంలోని నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపల్ సి.రాజశేఖరరెడ్డి అధ్యక్షతన మంగళవారం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానసిక వైద్య నిపుణురాలు డా.సుకీర్తి, పిల్లల వైద్య నిపుణులు డా.కమిడి కిశోర్ హాజరై.. మానసిక ఆరోగ్య ఆవశ్యకత, పిల్లల ఆరోగ్య భద్రతపై పలు సూచనలు చేశారు. కౌన్సిలర్ కె.విజయసురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా వెంకటాచార్యులు బాధ్యతల స్వీకరణ



ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా తాడి వెంకటాచార్యులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో ముమ్మిడివరం ఎంపీడీఓగా వచ్చారు. వెంకటాచార్యులుకు కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

అహోరాత్ర లలితా పారాయణం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో అహోరాత్ర లలిత పారాయణం మంగళవారం ప్రారంభమైంది. శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని లలితా మహిళా భక్త మండలి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పారాయణ చేశారు. ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తిల ఆధ్వర్యంలో కలశస్థాపన చేసి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

పంచ నదీ జలాలతో అభిషేకం

ముమ్మిడివరం: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపచారానికి క్షమాపణగా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని సీతా సమేత కళ్యాణ రామస్వామి ఆలయ సన్నిధిలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామికి మంగళవారం పంచ నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. ముమ్మిడివరం సబ్ డివిజన్ సమరత సేవా ఫౌండేషన్ కన్వీనర్ గొలకోటి సాయిబాబు, భాజపా నాయకులు గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, కొయ్యల దుర్గారావు, సలాది శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

తుప్పలు తొలగించరూ

కాట్రేనికోన పంచాయతీ పరిధి రామస్వామితోట నుంచి చెంచులగరువు వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. 300 మీటర్ల మేర తుప్పలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. ఈ సమస్యను సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకు వెళ్లగా తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



- న్యూస్‌టుడే, కాట్రేనికోన

నాలుగేళ్లుగా వదిలేశారు..!

ఇది ఐ.పోలవరంలోని ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్డు. రెండు కిలోమీటర్ల మేర అడుగడుగున గుంతలు పడి నాలుగేళ్లుగా ఇలానే దర్శనమిస్తుంది. నాలుగేళ్ల నుంచి ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వద్ద ప్రస్తావించగా ఈ రహదారికి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.



- న్యూస్‌టుడే, ఐ.పోలవరం

వర్షంతో ఇక్కట్లు

కాట్రేనికోన: మండలవ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి కురిసిన ఎడతెరిపి లేని వర్షానికి లోతట్టు ప్రాంతాలు, ఇళ్ల చుట్టూ జలమయం అయ్యాయి. కాట్రేనికోనలో ఆంధ్రబ్యాంకు రోడ్డు, పోలీసుస్టేషను రోడ్డు, బ్రహ్మన్నచెరువు, చెంచులగరువు, రామస్వామితోట తదితరచోట్ల రోడ్ల గుంతలు, పల్లపు ప్రాంతాల్లో నీరుచేరింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


రామస్వామితోటలో ఇళ్ల చుట్టూ చేరిన నీరు


పోలీసుస్టేషను రోడ్డులో..

మండలానికి 10 వేల సభ్యత్వాలు నమోదు చేయించాలి


భాజపా కార్యకర్తలతో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేసి మండలానికి 10 వేల సభ్యత్వాలను చేయించడానికి నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. ముమ్మిడివరంలో కొయ్యల దుర్గారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాలకు చెందిన భాజపా కార్యకర్తల సమావేశంలో సూర్యనారాయణరాజు మాట్లాడారు. మండల స్థాయిలో 25 మంది క్రియాశీలక సభ్యులతో పార్టీ మండల కమిటీలను ఏర్పాటు చేసే విధంగా యువత, మహిళలను సభ్యులుగా చేర్చాలన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, పాలూరి సత్యానందం, గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, మోకా వెంకటసుబ్బారావు, గనిశెట్టి బాబి, మట్టా సూరిబాబు, అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యానాం వెంకన్న కల్యాణోత్సవం



యానాం, న్యూస్‌టుడే: భూసమేత వేంకటేశ్వరస్వామి 22వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవీకన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సుప్రభాత సేవలను నిర్వహించారు.

నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవాలని సహాయసంచాలకుడు ఎం.ఎ.షంషీ సూచించారు. సమనసలోని రైతు సేవా కేంద్రంలో సర్పంచి పరమట శ్యామ్‌కుమార్ అధ్యక్షుడు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏవో కె.ధర్మప్రసాద్, ఉపసర్పంచి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

కాట్రేనికోన: రైతుల సమస్యలను అన్ని శాఖల ఆధ్వర్యంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గ్రామాల్లో రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ పీడీ జ్యోతిర్మయి తెలిపారు. కాట్రేనికోనలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ రాజశేఖర్, ఏవో మనోహర్‌లు పాల్గొని ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను రైతులకు అందించారు. ఏవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో మాధవి సూచించారు. భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ జె.వి.జి.రామారావు అధ్యక్షతన ఓటరు నమోదుపై అవగాహన సదస్సును నిర్వహించారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ కిషోర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ మదన్, ఏవో కృష్ణారావు పాల్గొన్నారు.


విద్యార్థినులతో ఆర్డీవో మాధవి

తాటాకిల్లు దగ్ధం

ఉప్పలగుప్తం: చినగాడవిల్లి పంచాయతీలో దూనబోయిన ప్రభాకరరావుకు చెందిన తాటాకు ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో సోమవారం రాత్రి అగ్నికి ఆహుతయ్యింది. సుమారు రూ.6 లక్షలు ఆస్తినష్టం సంభవించిందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుని నిత్యావసరాలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఈదరపల్లిలోని మండలపరిషత్తు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్) కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి మంగళవారం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే ఆనందరావు దృష్టికి తీసుకొచ్చారు. 94 వినతులు అందగా వాటిని ఆయా శాఖలకు బదలాయించినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ఐదేళ్లలో ప్రజలు వైకాపా పాలనతో విసిగిపోయారని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్, ఎంపీడీవో బాబ్జీరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి చంద్రమౌళి, మట్ట మహాలక్ష్మీప్రభాకరరావు, పొలమూరి ధర్మపాల్, లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

నిరసన ఉద్ధృతం చేస్తాం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) అవలంబిస్తున్న ద్వంద విధానాలు విడనాడాలని బీమా ఏజెంట్లు డిమాండ్ చేశారు. కొంకాపల్లి ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద బీమా ఏజెంట్లు రెండో రోజు శాంతియుత నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీలను సామాన్యులకు అందుబాటులోకి లేకుండా చేయడం, పాలసీదారులు ఇబ్బంది పెట్టేలా పలు చర్యలు చేపట్టారని అన్నారు. కొత్త నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, లేకుంటే నిరసన కార్యక్రమాన్ని ఉద్ధృతం చేస్తామని అన్నారు.

ముగిసిన శిక్షణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండలంలో ఉపసర్పంచులు, వార్డుసభ్యులకు పరిపాలన, నిర్వహణ తదితర అంశాలపై స్థానిక మండలపరిషత్తు కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటాచలం, కార్యదర్శులు పంచాయతీ పాలన, పారిశుద్ధ్య నిర్వహణ, సంపద కేంద్రాలు, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మొదటి దండకు రూ.లక్ష

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయదశమి వేడుకల సందర్భంగా రవణంవీధిలో మహిషాసురమర్దని అమ్మవారి మెడలో వేసే మొదటి దండను రూ.1.01,116కు ఆకుల లక్ష్మణరావు వేలంలో దక్కించుకున్నారు. మంగళవారం రవణంవీధిలో ఆలయం వద్ద దండ వేలంపాటను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావును ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రవణం చిట్టిబాబు, చిక్కం కిట్టు, కాసు, ప్రభు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీ బహుమతుల అందజేత

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: కర్షక గణపతి 80వ వార్షికోత్సవ నవరాత్రుల సందర్భంగా కూనవరంలో నిర్వహించిన లాటరీలో డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులను మంగళవారం కమిటీ సభ్యులు అందజేశారు.

డంపింగ్‌యార్డు సమస్య తీరేనా..!

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఓ పక్క డంపింగ్‌యార్డు సమస్య.. మరో పక్క ఎక్కడిక్కడ వర్షపునీరు నిలిచిపోయి మడుగులను తలపించేలా మారుతున్న రహదారులు.. ఇదీ అమలాపురం మండలం బండారులంకలో నెలకొన్న దుస్థితి. గ్రామంలోని జనాభా పెరుగుతున్నప్పటికీ మౌలిక వసతుల కల్పన ఆ స్థాయిలో లేదు. ఈ ప్రభుత్వంలోనైనా సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బండారులంక వివరాలు

జనాభా : 11,481	వార్డుల సంఖ్య : 16
పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య	: 11
రోజుకు సేకరించే చెత్త	: 1.5 టన్నులు

తాత్కాలిక పరిష్కారం..

జనావాసాల మధ్య డంపింగ్‌యార్డు వద్దంటూ ప్రజల నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టినా సమస్యకు పరిష్కారం లభించలేదు. శ్మశాన వాటిక చెంతనే ఉండటంతో చుట్టు పక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. ప్రస్తుతం చెత్తను డంపింగ్‌యార్డులో వేయకుండా తాత్కాలికంగా నిలుపుదల చేశారు.


చెత్త పేరుకుపోయిందిలా..


ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రధాన రహదారిలో నీరు

చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ప్రధాన రహదారిలో నీరు నిలిచిపోతోంది. అందులో దోమలు పెరుగుతున్నాయి. సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

చెత్త వేయడం లేదు

ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు డంపింగ్‌యార్డులో చెత్తను వేయడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

-కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, బండారులంక

మండపేట

•మండపేట •రామచంద్రపురం

ఎమ్మెల్యేను కలిసిన ఆర్యవైశ్య ప్రముఖులు


నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే

మండపేట: మండపేట ఆర్యవైశ్యసంఘ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసిన సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు కాళ్లకూరి గొల్లబాబు, అధ్యక్షుడు సంకా శ్రీనివాసరావు, శ్రీకృష్ణ పరమేశ్వరి ఆలయ ఛైర్మన్ పొనిపిరెడ్డి సుబ్బారావు, తెదేపా నాయకులు కేశవ రావు శ్రీనివాసరావు, గ్రంధి సత్తిరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలోని మెయిన్‌రోడ్డు, ఏడిద రోడ్డు, కేపీ రోడ్డు, రజక చెరువు వద్ద ఉన్న ఆక్రమణలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం తొలగించారు. కమిషనర్ టి.వి రంగారావు ఆదేశాలతో వ్యాపార దుకాణాల బయట, మురుగుకాలువపై ఏర్పాటు చేసిన ప్రకటనల బోర్డులు, నిర్మించిన రేకు షెడ్లను సిబ్బంది తొలగిస్తున్నారు.


ప్రకటనల బోర్డును తీసేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 గం. నుంచి మ. 12 గంట వరకు

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

వ్యర్థాలు తొలగించరూ..



సమస్య: మండపేట మండలం ద్వారపూడి సంగత వెంకటరెడ్డి కాలనీలో కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడం లేదు. దీంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయి వ్యాధులు బారినపడుతున్నాం. మురుగు పారుదలకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. - ఎస్.సత్యనారాయణ, ద్వారపూడి

సమాధానం: కాలువలో వ్యర్థాలు తొలగించి మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటాం. - వీవీ రమణ, పంచాయతీ కార్యదర్శి, ద్వారపూడి



సమస్య: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధి బ్యాంకు వీధిలో రహదారి పక్కన చెత్త పోస్తున్నారు. - జాయిన రాంబాబు, ద్వారపూడి

సమాధానం: బ్యాంకు వీధిలో రహదారి పక్కన పోస్తున్న చెత్తను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - వీవీ రమణ, పంచాయతీ కార్యదర్శి, ద్వారపూడి

వీధి దీపం లేని స్తంభం



సమస్య: రామచంద్రపురం కెఎస్ఆర్ నగర్‌లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కొన్ని స్తంభాలకు లైట్లే లేకుండా పోయాయి. వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాం. - కిరణ్, కె.ఎస్.ఆర్ నగర్, రామచంద్రపురం

సమాధానం: రామచంద్రపురం పట్టణ 20వ వార్డు కె.ఎస్.ఆర్ నగర్‌లో వీధి దీపాల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా సిబ్బందిని ఆదేశిస్తాం. - శ్రీకాంత్, మున్సిపల్ డీఈ, రామచంద్రపురం

ప్రమాదకరంగా గుంతలు

సమస్య: కేశవరం గనిపోతురాజు స్వామి ఆలయం వద్ద కల్వర్టు దగ్గర రహదారి భారీ గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - రామాంజనేయులు, కేశవరం.

సమాధానం: ప్రస్తుత గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో మరమ్మతులు చేస్తాం. - సూర్యనారాయణ, ర.భ.శాఖ డీఈ, రామచంద్రపురం

సమస్య: మారేడుబాక నుంచి కపిలేశ్వరపురం రహదారి అంచుల వద్ద చెత్త చెదారాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నిప్పు పెడుతున్నారు. దీంతో ఆటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - నాగ వెంకటలక్ష్మి, నేలటూరు.

సమాధానం: రహదారి అంచుల వద్ద చెత్తను తీయిస్తాం. పారిశుద్ధ్య కార్మికులకు అక్కడ నిప్పు పెట్టకుండా వారికి అవగాహన కల్పిస్తాం. - సాయి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, మారేడుబాక

- న్యూస్‌టుడే, రామచంద్రపురం, ద్వారపూడి, మండపేట గ్రామీణం

ముందుచూపు లేకనే.. మురుగు ముంపు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణం.. పేరుకే మున్సిపాలిటీ.. క్షేత్రస్థాయిలో చూస్తే ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ముఖ్యంగా మురుగు కాలువల విషయంలో, వాటి నిర్మాణాల విషయంలో పాలకులకు గత కొన్నేళ్లుగా ముందు చూపు కొరవడింది. దీంతో రోడ్లపైనే మురుగు నీరు ఉంటుంది. పట్టణంలో 28 వార్డులు, 12 వార్డు సచివాలయాలు 12,450 గృహాలు ఉన్నాయి. 5 ప్రధాన మురుగు కాలువలుండగా ఆయా వార్డుల్లో సుమారు 152 కిలోమీటర్ల పొడువున చిన్నచిన్న కాలువలున్నాయి. పట్టణంలో దశాబ్దాలకు పూర్వం మొదట్లో నిర్మించిన మురుగు కాలువలు శిథిలమై మళ్లీ నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రధాన రోడ్ల పక్కనే ఉన్నమురుగు కాలువలు గోడలు ధ్వంసమై ఎక్కడ మురుగు అక్కడే ఉండేపోతోంది. పట్టణంలోని 28 వార్డుల్లోనూ అటువంటి వాటిని పరిశీలించి తిరిగి మురుగు కాలువలు నిర్మిస్తేగాని వచ్చే వర్షాకాలానికి సమస్యలు పూర్తిగా తొలగిపోవనే చెప్పాలి.


పట్టణ ఆరోగ్య కేంద్రం, విద్యుత్తు సబ్‌స్టేషన్ పక్కన కాలువ నిర్మించని ప్రాంతం

శిథిలమైన కాలువలు

రామచంద్రపురం పట్టణంలో ముందుగా ఏర్పడిన కాలనీలు ఉన్న వార్డులు శిథిలమైన మురుగు కాలువల ప్రాంతాలు పరిశీలిస్తే.. ముఖ్యంగా 4వ వార్డు సూర్యానగర్‌లో ఎక్కువగా ఉన్నాయి. వర్షం వస్తే రోడ్లపై మురుగు చేరి చెరువులను తలపిస్తున్నాయి. 23వ వార్డు త్యాగరాజనగర్‌లో ఉన్న మురుగు కాలువ చెత్తతో నిండింది. 8వ వార్డు గంగుమళ్లవారి వీధిలోనూ కాలువల గోడలు పాడై మురుగు నీరు ముందుకు పారట్లేదు.. ఇలా అఫీషియల్ కాలని, చప్పిడివారి సావరం, శ్రీరామ్‌పేట, దండుగంగమ్మ గుడివీధి, హౌసింగ్‌బోర్డు కాలని, 27వ వార్డు చింతపల్లి సూరన్న నగర్, రజక వీధి, రత్నంపేట, ముచ్చుమిల్లి శివాలయం వీధి ఇలా పలు ప్రాంతాల్లో ఎప్పుడో పూర్వం నిర్మించిన చిన్న మురుగు కాలువలు శిథిలమై తిరిగి నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. వీటన్నింటిని పరిశీలించి కాలువలు నిర్మిస్తేనేగాని వర్షాకాలల్లో ఆయా వార్డుల్లో ఇబ్బందులు తప్పవని పలువురు పట్టణ వాసులు వేడుకుంటున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

రామచంద్రపురం పట్టణంలో ఆయా వార్డుల్లో శిథిలమై ఉన్న చిన్న కాలువలను పరిగణలోకి తీసుకుని వాటిని నిర్మించేలా చర్యలు చేపడతాం. గుత్తేదార్లకు నిధులు రాక ఇంకా వేగం కాకపోవడంతో ఒక్కొక్కటిగా కాలువలు, రోడ్ల అభివృద్ధి చేపడతాం. త్వరలోనే కాలువల సమస్యలను పరిష్కరింపజేస్తాం.

- శ్రీకాంత్, మున్సిపల్ డీఈ, రామచంద్రపురం

గ్రామ సభలో ఫ్లెక్సీ రగడ

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం చెల్లూరులో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి పనులపై ఏర్పాటైన గ్రామసభలో ఫ్లెక్సీపై సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు లేకపోవడంపై ఎన్డీఏ కూటమి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం ఎన్నార్జీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలు లేకపోవడాన్ని కూటమి సభ్యులు చుండ్రు వీర్రాజు, వల్లూరి సత్యప్రసాద్, దాలిపర్తి శ్రీను ఏపీవో సుధారాణిని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు పంపించిన నమూనాతోనే ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలడాన్ని నిరసిస్తూ కూటమి సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. నిరసనలో మాజీ సర్పంచి మోరంపూడి రాజ్‌కుమార్, పసల విద్యాధర్, కొప్పిశెట్టి సత్యనారాయణ, పీతల రవికుమార్, కొండేపూడి ఆనంద్, అడ్డగళ్ల నరేష్, సుంకర సంతోష్ తదితరులు ఉన్నారు.



చెల్లూరు గ్రామసభలో ఎన్నార్జీఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అర్తమూరులో ఉపాధి పనులపై ...

మండపేట గ్రామీణం: అర్తమూరులో గ్రామసభ మంగళవారం సర్పంచి గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి , ఉపసర్పంచి కర్రిజంబయ్య, కాకర శ్రీనివాసరావు, చంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ తెలిపారు. బుధవారం కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ పందొమ్మిది కేంద్రాల్లోనూ గొనె సంచులు ఏర్పాటు చేయడం, రిజిస్ట్రేషన్ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా రైతుకు అందుబాటులో రైస్‌మిల్లుకు ధాన్యాన్ని తరలించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గుణ్ణం పనసయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యులు కాదా ప్రభాకరరావు, సూరంపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు


సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రభాకర్

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ద్రాక్షారామ: కందులపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు హాజరై రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి అవసరమైన సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ ఏవీ రంగారావు ఎరువులు, పురుగుమందుల వినియోగం ఎంత మేరకు ఉండాలనే అంశాలను వివరించారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

రామచంద్రపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ సత్యలత పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఇంకా ఏ కళాశాలలో చేరని వారు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు విద్యార్హత, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో 12వ తేదీలోగా కళాశాలలో సంప్రదించాలని కోరారు. కళాశాలల్లో బీఎస్సీ జనరల్ అక్వాకల్చర్, కెమిస్ట్రీ మేజర్, మ్యాథ్స్ మేజర్, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్, బీకాం జనరల్, బీఏ స్పెషల్ తెలుగు, బీఏ ఎకనామిక్స్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8885349991 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

బైపాస్ ఉన్నా.. పట్టణంలోకి ఏల..!

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణానికి బైపాస్ రోడ్డు ఉండగా భారీ వాహనాలు ప్రధాన రోడ్డు నుంచి వెళ్తున్నాయి. వాటిని నియంత్రించాలని రామచంద్రపురం పట్టణ వాసులు కోరుతున్నారు. ఇప్పటికే డివైడర్ ఏర్పాటు చేసి ఇరుకుగా ఉండటం వల్ల ఎన్నో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇక భారీ వాహనాలు ప్రధాన రోడ్డులో వచ్చేస్తుంటే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. రామచంద్రపురం పట్టణ రాజగోపాల్ సెంటర్, పసలపూడి బైపాస్ రోడ్డు కూడలి వద్ద పోలీసులు వాహనాలను బైపాస్ రోడ్డుకు మళ్లించేవారు.. ఒక్కొక్క సారి ట్రాఫిక్ కానిస్టేబుల్స్ లేకపోవడంతో భారీ వాహనదారులు ఇదే అదునుగా ప్రధాన రోడ్డు బాట పడుతున్నారు. సంబంధిత పోలీసు అధికారులు భారీ వాహనాలను నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. దీనిపై రామచంద్రపురం సీఐ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా భారీ వాహనాలను అదుపుచేస్తామన్నారు. అనుమతిలేకుండా ప్రధానరోడ్డుకు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ప్రధాన రోడ్డులో వెళ్తున్న భారీ వాహనం


ద్రాక్షారామలో మహాలక్ష్మీదేవిగా..


వెదురుపాకలో..


అముజూరులో..


రామచంద్రపురంలో జ్ఞాన సరస్వతి


కొత్తూరు రోడ్డు కనకదుర్గమ్మ


పార్కువద్ద కనకదుర్గమ్మ


ద్వారపూడిలో..

ఐశ్వర్య ప్రదాయినికి నీరాజనం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా, ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో దుర్గాదేవిని మహాలక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. వెలంపాలెం గోగులాంబ అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు జరిగాయి.

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డు, పార్కువద్ద, అలాగే పట్టణ ప్రధాన రోడ్డు జ్ఞాన సరస్వతి అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. శీలంవారి సావరం రోడ్డులోను అమ్మవారి అలంకరణ ఆకట్టుకుంది. కొత్తూరు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారిని మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు.

పామర్రు: అముజూరు బాలాత్రిపురసుందరీదేవీ పీఠంలో శ్రీ చక్రానికి భక్తులు స్వయంగా పూజలు చేసుకునేందుకు పీఠాధిపతి వెలవలపల్లి సత్య అరుణ్ ఏర్పాట్లు చేశారు. కోటిపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కుంకుమ పూజలు జరిగాయి. పామర్రు ఆలయంలో మహిళలు సామూహిక లలితాసహస్రనామాలు పారాయణ చేశారు. పాణింగిపల్లి షిర్డీ సాయి ఆలయంలో బాలలుతో సరస్వతీపూజలు చేయించారు. సత్యవాడ వెంకటేశ్వరాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ద్వారపూడి: ద్వారపూడి బ్యాంకు వీధిలో ప్రసిద్ధి చెందిన శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాత వస్త్ర దుకాణ సముదాయం వద్ద శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని రూ.5,55,555 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గాపీఠంలో విజయదుర్గాదేవి... శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

మండపేట గ్రామీణం: మండపేట పట్టణంలోని గాంధీనగర్‌లో దుర్గా మందిరం వద్ద దీపాలంకరణ సేవ జరిగింది. మారేడుబాక ఫైర్ స్టేషన్ వద్ద దుర్గా మందిరం వద్ద సహస్రదీపాలంకరణ, వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారికి తామరపువ్వులతో అలంకరించారు.


ఆదివారపుపేట శివబాలయోగి ఆశ్రమంలో


మండపేటలో తామరపువ్వులతో

ఉచిత వైద్యశిబిరం

ద్వారపూడి: మండపేట మండలం జడ్.మేడపాడు గ్రామం సచివాలయంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేశవరం వైద్యాధికారిణి సీహెచ్.ప్రసన్నలత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. నోడల్ వైద్యాధికారిణి డాక్టర్ సుమలత శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.


సూచనలు చేస్తున్న నోడల్ వైద్యాధికారిణి సుమలత

ఆదమరిస్తే అపాయమే..

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాలతోడు ఎస్సీకాలనీకి వెళ్లే రహదారి మధ్యలో నెర్రలు రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తుప్పి నెర్రల్లో పడిపోతున్న పరిస్థితి. అయిదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. నెర్రల్లో తారు వేస్తే వాహనాలు పడిపోకుండా ఉంటాయని వాహనదారులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ రాజ్ జేఈ నాగేశ్వరరావును వివరణ కోరగా పరిస్థితిని పరిశీలించి తారువేసేందుకు చర్యలు చేపడతామన్నారు.



కాలినడకన దుర్గమ్మ చెంతకు

మండపేట గ్రామీణం: మండపేట పట్టణం, మండలంలోని పలుగ్రామాల నుంచి విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి దుర్గామాల వేసిన భక్తులు కాలినడకన వెళ్తున్నారు. కేశవరం నుంచి రాజమహేంద్రవరం మీదుగా కొందరు, తణుకు మీదుగా మరికొందరు భక్తులు బృందాలుగా వెళ్తుండటం కనబడుతోంది. మండపేటలోని పలు గ్రామాల నుంచి మంగళవారం సుమారు 1400 మంది విజయవాడకు వెళ్లినట్లు దుర్గామందిరాల నిర్వాహకులు తెలిపారు.

ప్రజా అభిమానంతోనే ఉన్నత పదవులు

చాగల్లు: ప్రజలు చూపిన అభిమానంతోనే తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి చాగల్లు మండలంలోని ఊనగట్ల, తదితర గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలను దర్శించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్రం స్వర్ణాంధ్రగా మారనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఎక్సైజ్ డివిజన్ పరిధిలో మద్యం షాపులకు పోటీ పడి మరీ టెండర్లు వేస్తున్నారు. రూ. 2లక్షలు డిపాజిట్ సొమ్ము తిరిగి రాదని తెలిసినా లెక్కకు మించి దరఖాస్తులు వచ్చేశాయి.. టెండర్లు దాఖలయ్యాయి. రామచంద్రపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కేవలం 18 షాపులకు అనుమతి ఉండగా ఏకంగా 165 దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 9వ తేదీతో దరఖాస్తుల గడువు ముగియనుండటంతో మరో 150 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసుకుంటున్నారు. ఇదిలాఉండగా 11వ తేదీ శుక్రవారం రోజున షాపులకు లాటరీ తీయనున్నారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన పాత 13 జిల్లాలకుగాను గీత కార్మికులకు మరొక నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

కార్తిక దీపారాధన మహోత్సవ కమిటీ సమావేశం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఉత్సవ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశం వద్దకు పీవీఆర్ సాధన సమితి సభ్యులు వచ్చి ప్రతిఏటా ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించే శ్రీ ప్రసన్నాంజనేయస్వామి కార్తిక దీపారాధన మహోత్సవ రాటముహూర్తానికి ఈ ఏడాది పైండా విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఆహ్వానిస్తే తాము వ్యతిరేకిస్తామని పీవీఆర్ పాఠశాల/కళాశాల సాధన సమితి సభ్యులు తెలిపారు. గ్రామానికి ఉపయోగపడే పాఠశాలను తెరిపించడం కోసం ఉద్యమించిన యువకులపై అక్రమంగా కేసులు బనాయించి రూ.51లక్షలు పరువునష్టం దావా వేశారని, అటువంటి వ్యక్తిని ఉత్సవానికి పిలిస్తే తాము అడ్డుకుంటామని వారు పేర్కొన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన కమిటీ వారు వారిని ఆహ్వానించబోమని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆళ్ల బుజ్జి, మాగాపు అమ్మిరాజు, ముప్పనపల్లి గణేష్, నామా వెంకన్నబాబు, గాధంశెట్టి సతీష్, యాట్లనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు

పరిశీలన

కె.గంగవరం మండలంలో పలు గ్రామాల్లో వైకాపా ప్రభుత్వం హయాంలో పలు భవనాలు నిర్మాణం జరిగాయి. నిధుల కొరతతో నిర్మాణాలు సా....గుతూ ఎట్టకేలకు పూర్తయ్యాయి. సాధారణ ఎన్నికల ముందే ఇవి నిర్మాణాలు పూర్తి చేసుకున్నా రాజకీయ నాయకులకు ఖాళీలేక ప్రారంభం చేయలేదు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం కుదరకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పలు భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం నేతలైనా ఈ భవనాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పామర్రు

పామర్రులో సుమారు రూ. 45లక్షల వ్యయంతో సచివాలయ భవనం నిర్మించారు. ఈ నిర్మాణం మూడేళ్లకిందటే మొదలైంది. అయితే మొదటి అంతస్తు అయ్యాక నిధుల కొరతతో ఏడాదిపాటు ఆగిపోయింది. ఎట్టకేలకు నిధులు రావడంతో గుత్తేదారు పనులు పూర్తి చేశారు. నిర్మాణం పూర్తి అయ్యింది కానీ ప్రారంభోత్సవానికి మాత్రం నోచుకోలేదు. నిరుపయోగంగా తాళం వేసి ఉంచారు.



ఇది మరీ విచిత్రం. తామరపల్లిలో అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మాణం పూర్తయి సుమారు నాలుగేళ్లు దాటిపోయింది. జిల్లా పరిషత్ నిధులు రూ. 10లక్షలతో కట్టారు. విద్యుద్దీకరణ పనులు చేయడంలో తాత్సారం జరిగిందని ప్రారంభాన్ని గాలికి వదిలేశారు. తరువాత మళ్లీ రంగులేసి సార్వత్రిక ఎన్నికల ముందు ప్రారంభిద్దామని స్థానికులు చేసిన ప్రయత్నాలు వీలుకాలేదు. ప్రస్తుతం అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తూ పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం ఉన్నా కూడా మాకు ఇదేం ఖర్మ అని అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు, పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు.



సుందరపల్లి సచివాలయానికి విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరయ్యింది. ఆ గ్రామ పరిధిలో దీని నిర్మాణానికి పంచాయతీ వారు మీనమేషాలు లెక్కించారు. అలాగే మూడేళ్లు గడిచిపోయాయి. ఇదే తరుణంలో సుందరపల్లి సచివాలయానికే చెందిన తామరపల్లి పంచాయతీ కార్యాలయం పక్కన ఖాళీ స్థలం ఉండడంతో విలేజ్ క్లినిక్ నిర్మాణం చేసేస్తామని అక్కడి నేతలు పట్టుపట్టారు. అప్పటి రాజకీయ నేతలు కూడా వత్తాసు పలకడంతో ఏడాది కిందట అక్కడ నిర్మాణం మొదలుపెట్టేశారు. నిధుల కొరత ఉన్నా కూడా ప్రతిష్టాత్మకంగా భవన నిర్మాణం పూర్తిచేశారు. ఎన్నికల ముందే ప్రారంభించాలనుకున్నా వీలు పడకపోవడంతో అలాగే తాళం వేసి ఉంచారు. ఇప్పటికైనా అధికారులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు కలుగచేసుకుని ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా కట్టినభవనాలను ప్రారంభించేలా చేయాలని కోరుతున్నారు.

